సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

మంగళవారం । 16 । జూలై । 2024



భూసార పరీక్ష - చేనుకు రక్ష

భూసార పరీక్షలను నిర్వహించుకుని తగిన పంటలను ఎంపిక చేసుకున్నపుడే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. - 8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం


సిద్ధవటం రేంజ్‌లోని లంకమల అడవుల్లో 18 ఎర్ర చందనం దుంగలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్ల కోసం స్పెషల్ టీమ్ గాలింపు చేపడుతోంది. - 8లో

గరిష్టం/కనిష్టం
32.4 /24.4

వాతావరణం

జిల్లాలో సోమవారం 24.4 - 32.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.





తమ్ముళ్లూ.. మీ కలలు సాకారం చేస్తా.. ఇంటికో ఉద్యోగం ఇస్తా.. లేదంటే నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు ఇస్తా.. అంటూ ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నెలదాటినా దీనిపై నోరు మెదపడంలేదు. 2014లోనూ రూ.2వేలు భృతి ఇస్తానంటూ ఇలాగే మాట తప్పారు.

భృతి.. భ్రాంతి!

- ఇంటికో ఉద్యోగం..లేదంటే రూ.3వేల భృతి ఇస్తానని చంద్రబాబు హామీ..
- నేటికీ ఆ ప్రస్తావనే లేదు
- నైరాశ్యంలో నిరుద్యోగులు
- అర్హులుగా 5.82 లక్షల బీపీఎల్ కుటుంబాలు



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే తన నిజ స్వరూపాన్ని బయటపెట్టుకుంటున్నారు. తల్లికి వందనం పేరుతో తల్లులను వంచించేందుకు సిద్ధమైన చంద్రబాబు.. నిరుద్యోగ భృతి పేరుతో చదువుకున్న యువతను మరోసారి నిట్టనిలువునా మోసగించేందుకు ఏమాత్రం వెనుకాడటం లేదు. తాను అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు ఉద్యోగం వచ్చేంత వరకు రూ.3 వేలు భృతి కల్పిస్తానని యువతలో ఆశలు రేకెత్తించారు. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటినా ఇంతవరకు నిరుద్యోగ భృతిపై నోరు మెదపడం లేదు. భృతి ఎప్పుడిస్తారు బాబూ అంటూ యువత ప్రశ్నిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, కడప : యువత నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తోంది. చంద్రబాబు సీఎం అయ్యారు, ఎన్నికల హామీ మేరకు ఇక ప్రతినెలా రూ.3వేలు భృతి లభిస్తోందని ఆశలు పెట్టుకున్నారు. టీడీపీ సర్కార్‌లో యువత ఆశలకు ఇప్పటికీ బీజం పడలేదు. మార్గదర్శకాలు రూపొందించాల్సిన ప్రభుత్వం మిన్నకుండిపోయింది. 2014నాటి ఇదే హామీ అందని ద్రాక్ష పుల్లనా అన్నట్లుగా ఉండిపోయింది. ఈమారైనా అమలు చేయడంలో నిర్లక్ష్యం వీడాలని గ్రామీణులు కోరుతున్నారు.

'ప్రతి ఇంటికి ఉద్యోగం లేదంటే నిరుద్యోగ భృతి తప్పకుండా ఇస్తాం'ఇవే మాటలు చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఊరు వాడ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి యువనేస్తం పథకం ద్వారా ప్రతి ఇంటికి నిరుద్యోగ భృతి కల్పిస్తామని తెలియజేశారు. సూపర్‌సిక్స్ పథకాల్లో ప్రధానంశంగా ఉండిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగం దక్కుతుందని, లేదంటే నిరుద్యోగ భృతి లభిస్తోందని యువత ఆశలు పెట్టుకుంది. జిల్లా వ్యాప్తంగా 5.82లక్షల బీపీఎల్ కుటుంబాలున్నాయి. వారంతా అర్హులు కానున్నారు. వారిలో నిరుద్యోగులు అత్యధికంగా ఉన్నట్లు సమాచారం ఉంది. కాగా జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో అధికారికంగా నమోదు చేసుకున్న నిరుద్యోగులు 50,511 మంది ఉన్నారు. ఇలా నమోదు చేయించుకున్నవారు కేవలం 10-20శాతం వరకూ మాత్రమే ఉంటారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. ఎందుకంటే ప్రతి సంవత్సరం యోగివేమన యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పట్టాలు తీసుకుంటున్న వారే దాదాపుగా 12వేల మందికి పైగా ఉన్నారు. ఇంటర్మీడియట్ పాస్ అయ్యే వారు సరాసరిగా 15వేలకు తగ్గడం లేదు. ఇంజనీరింగ్ పట్టా పొందేవారు దాదాపు 6వేల మంది జిల్లాలో ఉన్నారు. వీరు కాకుండా డిప్లొమా పూర్తి చేసేవారు లేకపోలేదు. సరాసరిగా 35వేల మందికి తక్కువ లేకుండా ప్రతిసంవత్సరం యువత పట్టాలు పుచ్చుకొని ఉద్యోగాలు కోసం ఎదురుచూస్తోంది. ఉద్యోగాలు దక్కని వారందరికీ నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పిన చంద్రబాబు ఆ దిశగా అడుగులు వేయకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీపీఎల్ కుటుంబాల వివరాలు

నియోజకవర్గం	బీపీఎల్ కుటుంబాలు
కడప	83,791
బద్వేల్	82,239
మైదుకూరు	79,918
పులివెందుల	82,809
కమలాపురం	86,694
జమ్మలమడుగు	87,189
ప్రొద్దుటూరు	79,993
మొత్తం	5,82,633



ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో నిరుద్యోగుల వివరాలు

ఓసీ	18,505
ఎస్సీ	13,867
ఎస్టీ	2,406
బీసీ-ఏ	4,784
బీసీ-బీ	6,782
బీసీ-సీ	441
బీసీ-డీ	3,716
మొత్తం	50,511

బీపీఎల్ కుటుంబాలే అధికం...

జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగువనున్నవారు అత్యధికంగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 5,82,633 కుటుంబాలు బీపీఎల్ పరిధిలో ఉన్నాయి. ఈ కుటుంబాలకు చెందిన విద్యార్థి యువకులంతా నిరుద్యోగ భృతికి అర్హులే. సరాసరిగా 83వేల బీపీఎల్ కుటుంబాలు ప్రతి నియోజకవర్గంలో ఉన్నాయి. సగం మందికి అటు ఇటుగా విద్యావంతులున్నా ప్రతి నియోజకవర్గంలో దాదాపు 40వేల మందికి నిరుద్యోగ భృతి దక్కాల్సిన పరిస్థితి ఉండిపోయింది. టీడీపీ సర్కార్ నిరుద్యోగ భృతి చెల్లిస్తే, వేడి నీళ్లకు చన్నీళ్లు తోడైనట్లుగా జీవనం సాగించవచ్చునే దిశగా గ్రామీణ యువత ఆశిస్తోంది. గడిచిన 2014-19 టీడీపీ సర్కార్ హాయాంలో లాగా కాకుండా తక్షణమే నిరుద్యోగ భృతి అమలు చేయాలని యువత డిమాండ్ చేస్తున్నారు.

ఇచ్చిన హామీ నెరవేర్చాలి..



- పసల రఘు, ఎంఏ పొలిటికల్‌సైన్స్, వెల్లటూరు, పెండ్లిమర్రి

చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలి. ఉన్నతవిద్యను పూర్తిచేసుకున్న మేము ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాం. మేము ఇంకా తల్లిదండ్రులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఎన్నికల హామీలో పేర్కొన్న విధంగా నిరుద్యోగభృతి అందిస్తే మాలాంటి నిరుద్యోగులకు ఆసరాగా ఉంటుంది.

స్పష్టత ఇవ్వాలి



- ఓబులేసు యాదవ్, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు

జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గతంలో మాదిరి కాలయాపన చేయకుండా విధివిధానాలను వెంటనే ప్రకటించాలి. అర్హులందరికీ తక్షణం భృతిని కేటాయించాలి. యువగళంలో మంత్రి లోకేష్ లక్షల్లో ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.

జాబ్ క్యాలెండర్ ఎప్పుడు ప్రకటిస్తారు..?



అధికారంలోకి రాగానే చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని టీడీపీ అధినాయకుడు నారాచంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. లేని పక్షంలో నిరుద్యోగ భృతి కింద ప్రతి నెలా రూ. 3 వేలు ఇస్తామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటినా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ నోటిఫికేషన్‌పై స్పష్టత రాలేదు. ప్రభుత్వం త్వరగా ఉద్యోగ నోటిఫికేషన్ పూర్తి చేయాలి. నిరుద్యోగులు ఇబ్బంది పడకుండా వారికి నిరుద్యోగ భృతి ఇవ్వాలి.
- రమేష్, పీడీఎస్‌యూ నాయకుడు, ప్రొద్దుటూరు.

నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే



- కట్టా చైతన్య, కాగితాల పెంట, కడప

టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి ఉద్యోగం కల్పిస్తామంటూ చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పటివరకు దాని గురించి ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. నిరుద్యోగ భృతికి సంబంధించి కూడా నిబంధనలు వదల్లేదు. నేను 2016లో డిగ్రీ పూర్తి చేశాను. ఎంబిఏ వరకు చదువుకున్నాను. ఎలాంటి ఉద్యోగంలేక పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నాను. చంద్రబాబు మాటమీద నిలబడి నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

ఆసరాగా ఉంటుంది..



- పవన్ కల్యాణ్, బీకాం, వల్లూరు

గ్రాడ్యుయేషన్ కోర్సు పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం ప్రయత్నం చేస్తున్న మాలాంటి యువతకు నిరుద్యోగభృతి అందిస్తే ఎంతో ఆసరాగా ఉంటుంది. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా నిరుద్యోగభృతిని వెంటనే చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. డిగ్రీ పూర్తయి రెండు మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా ఖర్చుల కోసం తల్లిదండ్రులపై ఆధారపడాల్సి వస్తోంది.

అందరికీ ఇవ్వాలి



ప్రభుత్వం మంజూరు చేస్తామన్న నిరుద్యోగ భృతికి వార్షిక ఆదాయంతో సంబంధం లేకుండా చదువుకున్న ప్రతి యువకుడి మంజూరు చేయాలి. అలాగే ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. దీంతోపాటు కడపజిల్లాలో కేంద్ర ప్రభుత్వం సెయిల్ అధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే నిరుద్యోగ సమస్య తీరుతుంది. - నాగేంద్రబాబు, డిగ్రీ, విద్యార్థి, కడప

ఎప్పుడు కరుణిస్తారో !



నాపేరు పోలిశెట్టి కళ్యాణ్. అట్లూరు మండలం కొండూరు ఎస్టీకాలనీ. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ యోగివేమన యూనివర్సిటీలో పూర్తి చేశాను. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించే వరకూ నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు దాని ఊసే ఎత్తడం లేదు. ఎప్పుడు కరుణిస్తారో అని ఎదురు చూస్తున్నాం.
- పోలిశెట్టికల్యాణ్, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, కొండూరు ఎస్టీ కాలని, అట్లూరు మండలం.

వయోపరిమితి దాటితే అర్హత కోల్పోతాం



నోటిఫికేషన్ ఆలస్యమైతే లక్షలాది మంది నిరుద్యోగులు రోడ్డున పడాల్సి వస్తుంది. వయోపరిమితి దాటితే ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత కోల్పోతాం. ఇప్పటికే డిగ్రీ పాసై 10 ఏళ్లయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ప్రతీ ఏడాది ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. నోటిఫికేషన్ ఇచ్చే లోపు నిరుద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా రూ.3వేలు నిరుద్యోగ భృతిని ఇవ్వాలి. - షేక్. జాకీర్ హుస్సేన్, వేంపల్లె.

న్యూస్‌రీల్

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం మైలవరం మండలం మినహా మిగతా 35 మండలాల్లో వర్షం కురిసింది. వల్లూరు మండలంలో 14.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చెన్నూరులో 11.2, వేంపల్లెలో 9.2, వీఎన్‌పల్లిలో 9, పోరుమామిళ్లలో 8.2, చక్రాయపేట 8, సిద్దవటంలో 7.4, వేములలో 7.0, దువ్వూరులో 6.8, కాశినాయనలో 6.4, సింహాద్రిపురం, ఖాజీపేట, కడపలలో 6.2, కమలాపురంలో 5.4, కలసపాడు, బద్వేల్, పెద్దముడియంలలో 5.2, మైదుకూరులో 5, రాజుపాలెం 4.8, ముద్దనూరు 4.6, పెండ్లిమర్రిలో 4.4, సీకేదిన్నె 4.2, జమ్మలమడుగు 4.2, ఎర్రగుంట్ల, పులివెందుల 4, చాపాడు 3.6, ఒంటిమిట్ట, బిమఠం 3.4, పొద్దుటూరు 3.2, తొండూరు 2.8, గోపవరం, అట్లూరు 2.4, లింగాల 1, కొండాపురం 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

17న ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కడప స్పోర్ట్స్: కడపలోని ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 17వ తేదీన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డానియల్ ప్రదీప్, సుధీర్ తెలిపారు. 2011 జనవరి నుంచి 2012 డిసెంబర్ మధ్యకాలంలో పుట్టిన క్రీడాకారులు ఈఎంపికలకు అర్హులన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టినతేదీ ధ్రువీకరణపత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

19న బీచ్ కబడ్డీ ..

వైఎస్ఆర్ కడప జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ పురుషులు, మహిళల బీచ్ కబడ్డీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఓ. రవీంద్రారెడ్డి, ఆర్. వెంకటసుబ్బయ్య తెలిపారు. యోగివేమన విశ్వవిద్యాలయంలోని వేమన ప్లేఫీల్డ్స్‌లో ఈ ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 6304309294, 9949304160 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జోరుగా పంటల సాగు



పసుపు పంటను సాగు చేస్తున్న రైతులు



జిల్లాలలో సాగులో ఉన్న వేరుశనగ

- వర్షాలరాకతో వ్యవసాయపనులు ముమ్మరం
- జులై 12 నాటికి 8859 హెక్టార్లలో సాగు

కడప అగ్రికల్చర్ : జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ పంటలసాగు ముమ్మరమైంది. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలోనే వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. దీనికితోడు గత ప్రభుత్వం రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలు, వేరుశనక్కాయలను ఆయా రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసింది. ఎరువులు కూడా సిద్ధంగా ఉన్నాయి.జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సాధారణ సాగు 75189 హెకార్లు కాగా వ్యవసాయ అధికారులు 79115 హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. లక్ష్య సాధనకు ప్రణాళికలను సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 8859 హెక్టార్లలో వివిధ పంటలు సాగై 11.78 శాతంగా నిలిచింది. ఈ ఏడాది జూన్ 30వ తేదీ నాటికి జిల్లాలో 4757 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. గతేడాది జూన్ చివరి నాటికి 1961 హెక్టార్లలో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి. అంటే గతేడాది కంటే ఈ సంవత్సరం 2795 హెక్టార్లలో పంటలసాగు పెరిగింది. ఈ ఏడాది జులై 12వ తేదీ నాటికి జిల్లాలో 8859 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి.గతేడాది జులై 12వ తేదీ నాటికి 4328 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. గతేడాది కంటే ఈ సంవత్సరం జూన్ 12వ తేదీ నాటికి జిల్లాలో 4531 హెక్టర్లలో అధనంగా వివిధ పంటలు సాగయ్యాయి.

పెరిగిన ఆరుతడి పంటలసాగు...

ఈ ఏడాది జిల్లాలో వర్షాలు కురుస్తుంటంతో ఆరుతడి పంటలసాగు బాగా పెరిగింది. ముఖ్యంగా పత్తి, వేరుశనగ, మినుము పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. జిల్లాలో పత్తి సాధారణసాగు 24086 హెక్టార్లుగా అధికారులు నిర్ధారించారు. గతేడాది ఇదే సమయానికి జిల్లాలో 2204 హెక్టార్లలో పత్తి సాగు కాగా ఈ ఏడాది జూలై 12 నాటికి 3147 హెక్టార్లలో సాగైంది. వేరుశనగ సాధారణ సాగు 5971 హెక్టార్లు. అయితే గతేడాది ఇదే సమయానికి 909 హెక్టార్లలో సాగు కాగా ఈ ఏడాది 1234 హెక్టార్లలో సాగైంది. మినుముపంట సాధారణసాగు 2642 హెక్టార్లు, గతేడాది 470 హెక్టార్లలో సాగు కాగా ఈ ఏడాది 1910 హెక్టార్లలో సాగైంది. మొక్కజొన్నకు సంబంధించి సాధారణ సాగు 637 హెక్టార్లు. గతేడాది 114 హెక్టార్లలో సాగుకాగా ఈ ఏడాది 508 హెక్టార్లలో సాగైంది.

పంటల సాగు వివరాలు

పంటల రకాలు	జూన్ 29వ తేదీకి సాగైన పంటలు	జూలై 12వ తేదీకి సాగైన పంటలు	పెరిగిన సాగు
పత్తి	2115	3147	1032
మినుము	1164	1910	746
వేరుశనగ	660	1234	574
సోయాబీన్	184	188	04
వరి	266	1081	815
మొక్కజొన్న	115	508	393
సజ్జలు	29	132	103
ఆముదం	46	135	89
కొర్ర	67	209	142
కందులు	69	210	141
పెసలు	14	26	12

ఊపందుకున్న వ్యవసాయ పనులు



జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులకు కావాల్సిన సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశాం. ఎరువులు కూడా రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయి. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.
- అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : జేసీ



సమస్యలు తెలుసుకుంటున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీతోపాటు డీఆర్వో గంగాధర్ గౌడ్, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్‌లు హాజరయ్యారు. ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. అనంతరం పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సు నియామకాలు చేపట్టాలి

కడప సెవెన్‌రోడ్స్ : స్టాఫ్ నర్సు ఐదవ ఎంపిక జాబితాలో అర్హులైన వారికి ఉద్యోగ నియామకాలు ఇవ్వాలని అర్హులైన స్టాఫ్ నర్సులు కోరారు. సోమవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. జోన్-4లోని కడప వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో గత సంవత్సరం నవంబరులో స్టాఫ్ నర్సు నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేశారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. 10 వేలకు పైగా దరఖాస్తులు రాగా నిబంధనలు, మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థుల మెరిట్ జాబితా తయారుచేసి విడతల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించారన్నారు. ఇప్పటికి నాలుగు దశల్లో ఎంపికైన వారికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ఐదోదశలో తాము 206 మంది సెలెక్షన్ జాబితాలో ఉన్నామన్నారు. గతనెల 6వ తేదీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి రావాలంటూ తమకు సమాచారం పంపించారన్నారు. అయితే అర్ధాంతరంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ రద్దు చేశారని తెలిపారు. 5వ నోటిఫికేషన్ వాళ్లను తర్వాత మళ్లీ పిలుస్తామని చెప్పారుగానీ ఇంతవరకు తమకు ఎలాంటి సమాచారం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా 206 మందికి నియామక పత్రాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.

21న చలో హైదరాబాద్

కడప సెవెన్‌రోడ్స్ : ఈవీఎం వద్దు...బ్యాలెట్ పేపరే ముద్దు అనే నినాదంతో ఈనెల 21న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కమిటీ జాతీయ సమన్వయకర్త సంగటి మనోహర్ మహాజన్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 5.00 గంటల వరకు హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈవీఎం వ్యతిరేక జాతీయ ఉద్యమ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈవీఎంలను వెంటనే నిషేధించి ఇకపై జరిగే ప్రతి ఎన్నిక బ్యాలెట్‌తోనే జరపాలని డిమాండ్ చేశారు. జాతీయ ఉద్యమ సమావేశానికి జిల్లా నుంచి తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అవ్వారు మల్లికార్జున, షేక్ అమీన్‌పీరా, జేవీ రమణ, వైఎం ప్రతాప్‌రెడ్డి, డీఎంకే జిల్లా నేత రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాయితీపై రుణాలివ్వాలని ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రాయితీపై రుణాలివ్వాలని జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాయితీపై రుణాలు ఇవ్వడం లేదని, పాత పద్ధతిని పునరుద్ధరించి ఆయా వర్గాల ప్రజలకు మేలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ హ్యూమన్ రైట్స్ ఫోరం అధ్యక్షుడు జేవీ.రమణ, బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడు పీవీ.రమణ, జనతాదళ్(ఎస్)రాష్ట్ర అధ్యక్షుడు వైఎం.ప్రతాప్ రెడ్డి, మహాజన రాజ్యం పార్టీ నాయకుడు సంగటి మనోహర్, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సీఆర్‌వీ.ప్రసాదరావు, దళిత మిత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కె.రామాంజనేయులు, చేనేత ఐక్యవేదిక నాయకులు చెన్న రామయ్య, నూకల పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

22న డిగ్రీ విద్యార్థులకు వైవా-వోస్ పరీక్ష

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు వైవా-వోస్ నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి తెలిపారు. లాంగ్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టు ఫీజు చెల్లించిన విద్యార్థులు వైవా వోస్‌కు కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టు రికార్డు హార్డ్ కాపీని సమర్పించాలన్నా. అనుబంధ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ అందరూ విద్యార్థులకు సమాచారం అందించాలని కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషనింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీ నుంచి 30 రోజులపాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువకులు శిక్షణకు అర్హులన్నారు. దూర ప్రాంతాల వారికి స్థానికంగా ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. గ్రామీణ యువతకు ప్రాధాన్యం ఉంటుందని, ఇతర వివరాలకు 94409 05478, 94409 33028నెంబరులో సంప్రదించాలన్నారు.

ఏపీపై విచారణ


విచారణ చేస్తున్న డీఎల్‌డీఓ వెంకటసుబ్బయ్య

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి ఎంపీడీవో కార్యాలయం ఏఓ అల్తాఫ్ హుస్సేన్‌పై సోమ వారం కడప డీఎల్‌డీఓ వెంకటసుబ్బయ్య విచారణ చేపట్టారు. ఎన్నికల సమయంలో, ఎన్నికల తర్వాత తమ పార్టీకి వ్యతిరేకంగా పోస్టులు పెట్టాడని మండల టీడీపీ నాయకులు జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పీఓ విచారణ చేసి విషయాలు తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

దళితుడిపై దాడి కేసులో డీఎస్పీ విచారణ

ఒంటిమిట్ట : మండలంలోని పెన్నపేరూరు గ్రామంలో శనివారం దళితుడిపై దాడి జరిగిన కేసులో సోమవారం కడపస్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్ విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం పెన్నపేరూరు గ్రామానికి చేరుకొని అక్కడి సాక్షులను విచారించి రిపోర్టు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు ఉన్నారు.

భూసార పరీక్ష - చేనుకు రక్ష

రైతు తన పొలంలో అధిక దిగుబడి పొందాలన్నా.. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నా.. మట్టి స్వభావం తెలుసు కోవాలన్నా.. భూమిలో ఎలాంటి పంటలు పండించుకోవాలన్నా ముందుగా భూసార పరీక్షలు చేయించాలి. మట్టి పరీక్ష చేయించి తగు సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించడానికి అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

వల్లూరు : భూసార పరీక్షలను నిర్వహించుకుని

36 మండలాల్లో మట్టి నమూనాల సేకరణ


భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తగిన పంటలను ఎంపిక చేసుకున్నప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయశాఖ జిల్లాలో భూసార పరీక్షల నిర్వహణకు మట్టి నమూనా సేకరణ ప్రారంభించింది. 2024- 25 సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా 36 మండలాల్లో మొత్తం 17800 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. పోషక విలువలతోబాటు భూమిలోని చౌడు గుణం, సున్నం శాతం, నేల కాలుష్యం స్థాయి తెలుసుకోవడానికి భూసార పరీక్ష ఉపయోగపడుతుంది. భూమి స్వభావాన్ని తెలుసుకోవడం ద్వారా తగిన పంటలను సాగు చేసి అద్భుత ఫలితాలు సాధించవచ్చునని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇవి పాటించడంతో రైతులు పంటల సాగులో ఖర్చు తగ్గించుకుని నికర ఆదాయాన్ని పెంపొందించుకునే అవకాశాలున్నాయి.

ఎరువుల వాడకంలో మెలకువలు

కనీసం రెండు లేక మూడు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలను చేయించుకుని తమ పొలాల్లో వివిధ పోషక పదార్థాల విలువలు తెలుసుకోవాలి. ఫలితాల ఆధారంగా తగిన మోతాదులోనే ఎరువులు వాడి అవసరమైన పోషకాలు అందించడం చాలా ముఖ్యం. తద్వారా అనవసర ఖర్చు తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుంది. భూమిలో పోషకాలు సమర్థంగా వినియోగించుకుని దిగుబడులు సాధించవచ్చు.

మట్టి పరీక్షలు చేయించుకోవాలిలా..

- భూసార పరీక్ష నిర్వహించడంలో సరైన పద్ధతి పాటించినపుడే సత్ఫలితాలు వస్తాయి.
- పొలంలో ఆంగ్ల వి అక్షరం ఆకారంలో 15సెం.మీ వరకు పారతో గుంత తీసి అందులో పైపార నుంచి కింది పార వరకు మట్టిని సేకరించాలి.
- ఎకరా విస్తీర్ణంలో ఎనిమిది నుంచి పది చోట్ల సేకరించిన మట్టిని ఒక చోట చేర్చి బాగా కలిపి నాలుగు భాగాలుగా చేయాలి. ఎదురెదురుగా వున్న భాగాలను అర కిలో వచ్చే వరకు తీసుకుని మిగిలినవి తీసి వేయాలి.
- సేకరించిన మట్టిలో రాళ్లు, వేర్లు లేకుండా చేసి నీడలో ఆరబెట్టాలి. మట్టి నమూనా సేకరణకు రసాయన, సేంద్రియ ఎరువుల సంచులు వాడరాదు.
- గట్ల వద్ద, పంట కాల్వలు, చెట్ల కింద, ఎరువును కుప్పగా వేసినచోట.. ఎప్పుడూ నీరు నిల్వ వుండే ప్రదేశంలోనూ మట్టి నమూనాలు సేకరించరాదు.
- పొలంలో చౌడు ప్రాంతం ఉన్నట్లయితే ప్రత్యేకంగా మట్టి నమూనా తీసి పంపాలి. పంట రకాన్ని బట్టి మూడు నుంచి ఆరు అడుగుల లోతు వరకు గుంత తీసి ప్రతి అడుగుకు మట్టి సేకరించి పంపాలి. వుంటుంది.

కార్డులలో నమోదు

వ్యవసాయ డివిజన్ వారీగా మట్టి నమూనాల సేకరణ లక్ష్యాలివీ..

వ్యవసాయ డివిజన్	మండలాల సంఖ్య	నమూనాల సంఖ్య
కడప	6	2580
కమలాపురం	4	2180
పులివెందుల	5	2760
ముద్దనూరు	4	2360
ప్రొద్దుటూరు	4	1990
మైదుకూరు	4	2360
బద్వేలు	4	1390
పోరుమామిళ్ల	5	2180

రైతులు సేకరించిన మట్టి నమూనాలను అందుబాటులో ఉన్న భూసార పరీక్షా కేంద్రాలకు పంపాలి. వారు పరీక్షలు నిర్వహించి వివిధ పోషక విలువల శాతాన్ని కార్డులలో పొందుపరచి రైతుకు అందజేస్తారు.

ప్రధాన పోషకాలేవి?

ఉదజని సూచిక, లవణ సూచిక, సేంద్రియ కర్బనం తోపాటు ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం, సూక్ష్మ ధాతు పోషకాలైన గంధకం, జింక్, బోరాన్, ఇనుము, మాంగనీస్, రాగి వంటి వాటి విలువల శాతాన్ని నమోదు చేసి అవి వుండాల్సిన శాతం భూసార పరీక్షల ద్వారా తెలుస్తుంది. పంటలకు వాడాల్సిన ఎరువుల మోతాదు, వాడే విధానం సూచిస్తారు.

భూసార పరీక్షతో ప్రయోజనాలు



భూసార పరీక్ష చేయించుకుని నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేయడంతో మంచి ఫలితం ఉంటుంది. భూమిలో పోషకాల విలువలను తెలుసుకుని అవసరమైన ఎరువులు వాడవచ్చు. దీంతో అనవసర ఖర్చు తగ్గించుకోవడానికి అవకాశం వుంది.

- ఏవీ.నరసింహారెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు, కమలాపురం

జర్నలిస్టుల ఆరోగ్య పథకం పొడిగింపు


కలెక్టర్ శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్ : వర్కింగ్ జర్నలిస్టుల ఆరోగ్య పథకం 2024-25 సంవత్సరానికి పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ శివశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారీ రూ.2లక్షల వరకు వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఏడాది కాలంలో ఎన్నిసార్లైనా పరిమితులు లేకుండా ఈ సదుపాయాలందిస్తారని చెప్పారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ తరహాలో వైద్య సేవలు పొందవచ్చన్నారు. వైద్య సేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, అలాగే నిర్దేశిత చికిత్సకు సంబంధించి ఉచిత ఓపీ సేవలు పొందవచ్చని తెలిపారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులంతా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. www.cfms.ap.gov.in వెబ్ సైట్ ద్వారా రూ.1250 చెల్లించి వచ్చే సంవత్సరం మార్చి 31వతే dw వరకు లబ్ధిపొందవచ్చన్నారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, అక్రిడిటేషన్ జిరాక్స్, హెల్త్ స్కీమ్ దరఖాస్తు, కుటుంబసభ్యుల ఫొటోలు, ఆధార్ కార్డు కాపీలను జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఆర్ట్స్ కళాశాల ఆచార్యుడికి పేటెంట్ పత్రం


డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డికి పేటెంట్ సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్

వైవీయూ: కీటకాల నియంత్రణకు కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల భౌతిక శాస్త్ర ఆచార్యులు డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి రాసిన అంశానికి పేటెంట్ సర్టిఫికెట్ దక్కింది. 'డివైస్ ఫర్ కంట్రోలింగ్ ద స్టెప్ బోరర్ ఇన్సెక్ట్ ఇన్ క్రాప్ మేనేజ్‌మెంట్' అంశంపై ఆయన వ్యాసం రాసి జూలై 3న దరఖాస్తు చేసుకున్నారు. గతంలో ఈయన నాగపూర్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ సంజయ్ దోబ్లే బృందంతో కలిసి కీటకాల నియంత్రణపై పరిశోధనలు చేశారు. ఎల్‌ఈడీ, ఇతర రకాల నూనె ఉపయోగించి కీటకాలను ఆకర్షించే వినూత్న పరికరాన్ని అభివృద్ధి చేశారు. వాటిని సామూహికంగా పట్టుకోవడానికి ఎగ్‌మార్మెలోస్ పల్స్, వాటర్ కొల్లాయిడల్‌ను ఉపయోగించే విధానంపై స్పష్టత ఇచ్చారు. సోలార్ ప్యానల్ లేదా బ్యాటరీని ఉపయోగించి తక్కువ ఓల్టేజ్‌తో ఆ పరికరం పని చేస్తుంది. దీని సాయంతో పొలాల్లో కాండం తొలిచే పురుగుతో కలిగే నష్టాన్ని నియంత్రించవచ్చు. ఇతర కీటకాలు కూడా సామూహికంగా చిక్కుకుపోతాయి. దీనిపై ఆయన పేటెంట్ కోసం దరఖాస్తు చేయగా యూకేకు చెందిన ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆఫీస్ ఈ నెల 10వతేదీన పేటెంట్ ఇస్తూ ధ్రువ పత్రం అందజేసింది. ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్ చేతుల మీదుగా కడప ఆర్ట్స్ కళాశాలలో ఆ సర్టిఫికెట్‌ను డా.బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి అందుకున్నారు. ఈ వినూత్న పరికరం తక్కువ ఖర్చుతో కూడుకున్నదని, పర్యావరణ అనుకూలమైనదని డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. తమ కళాశాల అధ్యాపకుడికి యూకే పేటెంట్ లభించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

ప్రభాకర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి


బాధితుడు ప్రభాకర్‌తో మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం నాయకులు

కడప కార్పొరేషన్ : ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరుకు చెందిన దళితుడు కదిరి ప్రభాకర్‌పై వేడి నూనె పోసి హత్యాయత్నం చేయడం దారుణమని, నిందితుడిని వెంటనే శిక్షించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు వంగిమల రమణయ్య పేర్కొన్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కదిరి ప్రభాకర్‌ను సోమవారం వారు పరామర్శించారు. వైద్యులు, పోలీసులతో మాట్లాడి వాస్తవాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ నెల 12న గంగపేరూరులో బంధువు చనిపోతే అంత్యక్రియలకు వెళ్లి సాయంత్రం ప్రభాకర్ స్వగ్రామం పెన్న పేరూరుకు చేరుకున్నాడన్నారు. ఉదయం నుంచి భోజనం చేయనందున కళ్లు తిరిగి చిల్లర అంగడి నిర్వహిస్తున్న గజ్జల వెంకట సుబ్బారెడ్డి దుకాణం వద్దకు చేరుకుని నీళ్ల ప్యాకెట్ అడిగాడని, ఈ లోపు నీరసం ఎక్కువై నిలబడలేక అంగడి ముందు అరుగుపై కూర్చొన్నాడన్నారు. దీంతో అంగడి యజమాని సుబ్బారెడ్డి కోపంతో 'మాల నా కొడకా 'మా అరుగు మీదనే కూర్చుంటావా ...అంటూ కట్టెతో కొట్టడమేగాక, ఇంట్లో బజ్జీలు వేసేందుకు కాచిన వేడి నూనెను అతడిపై పోశాడన్నారు. అతడి భార్య జయమ్మను కులం పేరుతో తిట్టడం తగదన్నారు. ఈ సంఘటనతో ప్రభాకర్ కుటుంబం జీవనోపాధి దెబ్బతిందని, పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడు జి.వెంకట సుబ్బారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని, ప్రభాకర్ కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనని వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వాసుదేవ కుమారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ట్యాలీలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగుళూరు నగరంలో కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయి 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. 35 రోజులపాటు కొనసాగే ఈ శిక్షణలో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు.

శిక్షణానంతరం వివిధ సంస్థల్లో కనీస వేతనం రూ.15వేలతో ఉపాధి కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

గోపవరం : మండలంలోని ప్రాజెక్టు కాలనీ-2లో సోమవారం రాత్రి విద్యుత్తు షాక్‌కు గురై మన్యం అశోక్ (29) మృతిచెందాడు. ఇంటి వద్ద తాగునీటి కోసం ఉపయోగించే మోటారుకు మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు వైద్యం నిమిత్తం హుటాహుటిన 108 వాహనంలో బద్వేల్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు రోదించారు. కాగా ఇదే గ్రామంలో వరుస విద్యుత్తు ప్రమాదాలతో ముగ్గురు వ్యక్తులు మృతిచెందడంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు.


మృతి చెందిన అశోక్

జీపీఎస్‌ను రద్దు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగుల మనోభావాలకు వ్యతిరేకంగా ఉన్న గ్యారెంటీ పింఛన్ స్కీమ్ గెజిట్ ఉత్తర్వులను రద్దు చేయాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. కడప ఎస్టీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సీపీఎస్ రద్దు విషయం పరిశీలిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దాని గురించి పరిశీలించే లోగానే గ్యారెంటీ పింఛన్ స్కీమ్ అమలు పరిచే ఉత్తర్వులివ్వడం దారుణం అన్నారు. ప్రభుత్వం వెంటనే ఆ ఉత్తర్వులను రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలుకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటుచేసి పాత పింఛన్ స్కీమ్ అమలుకు విధి విధానాలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుపాకుల మురళి, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్, సలాం, శ్రీరామ్, ఎల్వి రవిశంకర్, పాల్గొన్నారు

సీపీఎస్ రద్దు దిశగా అడుగులేయాలి : ఒంటేరు శ్రీనివాసులురెడ్డి

కడప ఎడ్యుకేషన్ : సీపీఎస్ రద్దు చేసి పాత పింఛను పథకం దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. జీపీఎస్‌జీవో గెజిట్‌ను తాత్కాలికంగా నిలిపివేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ఆదేశించడం ఉపాధ్యాయులకు తాత్కాలిక ఉపశమనమే అయినప్పటికీ, ఈ పథకాన్ని రద్దుచేసి పాతపింఛను పథకాన్ని తీసుకువస్తేనే ఉద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు ఇటీవల సీపీఎస్‌కు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిందని, చాలా రాష్ట్రాలు ఓపీఎస్‌ను అమలు చేస్తున్నాయన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే గ్రాట్యుటీ, ఫ్యామిలీ పింఛన్ తీసుకువచ్చారని, కేవలం సర్వీసు పింఛను ఒక్కటీ ఇస్తే కష్టాలు తీరుతాయన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి


కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్: మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సుంకర రవి, తిరుపాల్ డిమాండ్ చేశారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ కొవిడ్-19 సమయంలో పారిశుద్ధ్య కార్మికులను ఫ్రంట్‌లైన్ వారియర్స్ అని బిరుదులిచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. కష్టానికి తగిన జీతం, ఉద్యోగ భద్రత కల్పించక పోవడం దారుణమన్నారు. ఎనిమిదేళ్లుగా పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఎన్నోమార్లు ఆందోళన చేసినా పరిష్కారం లభించలేదన్నారు. ప్రమాదవశాత్తూ చనిపోయిన ముగ్గురు కార్మికుల కుటుంబాలకు ఆర్థికసాయం చేసి, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. అనంతరం అడిషనల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇ.ప్రకాష్, వి. శ్రీధర్ బాబు, సుంకర కిరణ్, శివ, దస్తగిరిమ్మ, వెంకటేష్, నాగరాజు, రాజు, పెంచలయ్య, చెన్నయ్య, రవి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు కడప కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ తమకు వేతనాలు అందించడంలో అధికారుల నిర్లక్ష్యం ఏమాత్రం తగదన్నారు. గ్రామీణ స్థాయిలో పనిచేసే వారి పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ముఖ్యంగా తమకు పెండింగ్ వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఇప్పటికే జిల్లా, రాష్ట్ర అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడం బాధాకరమని తెలిపారు. ప్రభుత్వం మానవతా హృదయంతో స్పందించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు కృష్ణారెడ్డి, గంగిరెడ్డి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

18 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సిద్దవటం : సిద్ధవటం రేంజ్‌లోని లంకమల అడవుల్లో 18 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని రేంజర్ కళావతి పేర్కొన్నారు. విలేకరులతో ఆమె మాట్లాడుతూ సిద్దవటం ఫారెస్ట్ ఫోర్స్ స్పెషల్ టీమ్ లంకమల అభయారణ్యంలో రెండు రోజులుగా కూంబింగ్ నిర్వహిస్తోందన్నారు. సిద్ధవటం బీట్‌లోని సమస్యాత్మక ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా కొందరు ఎర్రచందనం చెట్లను నరుకుతున్నట్లు ఉప్పు గుంతలు అటవీ ప్రదేశంలో శబ్దాలు వినిపించాయన్నారు. అక్కడికి వెళ్తుండగా వారు అటవీ సిబ్బందిని చూసి ఎర్రచందనం దుంగలు వదిలేసి పరారరయ్యారన్నారు. స్మగ్లర్ల కోసం స్పెషల్ టీమ్ అడవిలో గాలింపు చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. అక్కడ లభ్యమైన 18 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొని అటవీ శాఖ కార్యాలయానికి తరలించామని రేంజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె.ఓబులేసు, సిద్దవటం బీట్ ఇన్‌చార్జి ఎఫ్‌బీఓ పెంచల్‌రెడ్డి, ఏబీఓ హైమావతి, బేస్ క్యాంప్ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.